సాక్షి
చిత్తూరు
సోమవారం । 4 । నవంబర్ । 2024



యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు
ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాలను పుత్తలపట్టులో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. - 8లో



పసిమొగ్గలపై మృగాళ్ల పంజా
చిరుతిండ్ల కోసం ఆశగా చూసే అభం శుభం తెలియని చిన్నారులపై మృగాళ్లు మాటేసి పంజా విసురుతున్నారు. - 8లో



బోయకొండ కిటకిట
జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆలయం ఆదివారం తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి ఆయా శాఖల జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

10న శిక్షణకు స్క్రీనింగ్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. త్వరలో నిర్వహించబోయే మెగా డీఎస్సీ పరీక్షకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 10న నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.


ట్రాన్స్‌కోలో ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న సాయిసుధాకర్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కోలో ఖాళీలను భర్తీ చేయాలని ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్ అసోసియేషన్ (ఏపీపీడీఈఏ) డిస్కం(రాయలసీమ, నెల్లూరు జిల్లాల) సలహాదారుడు సాయిసుధాకర్ డిమాండ్ చేశారు. చిత్తూరులోని విద్యుత్ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. నిబంధనల ప్రకారం వినియోగదారులకు సేవలు అందాలంటే అందుకు సరిపడిన ఉద్యోగులు సంస్థలో లేరన్నారు. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో ఉన్న వారికి అదనపు పనిభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగులు ఒత్తిడికి లోనవుతున్నారని చెప్పారు. జిల్లాలోని 40 సెక్షన్లలో 15 మంది వరకు ఏఈ, సబ్‌ఇంజినీర్ల కొరత ఉన్నట్లు గుర్తుచేశారు. విద్యుత్ పరికరాలు లేకపోవడంతో వ్యవసాయ, ఇతర సర్వీసులు సకాలంలో ఇవ్వలేకపోతున్నారని వివరించారు. దీనికి తోడు ఎస్‌ఓపీ నిబంధనల పేరిట జరిమానాలు వేయడం ఒత్తిడికి గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, తిరుపతి సర్కిల్ కార్యదర్శి మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి గుణశేఖర్, నాయకులు గణపతి తదితరులు పాల్గొన్నారు.

భూమన ప్రమాణస్వీకార కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు



సమరోత్సాహం!



సభాప్రాంగణం వద్ద కోలాటం

అదే ఉత్సాహం.. అదే జోష్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో కనిపించింది. ఈలలు.. చప్పట్లో సభాప్రాంగణం మార్మోగింది. 'గిరగిరా తిరుగుతోంది ఫ్యాను'.. అంటూ చేతిలో ఫ్యాను గుర్తును చూపిస్తూ కేరింతలు కొట్టడం నేతలను సైతం ఉత్సాహ పరిచింది. పోలీసుల అడ్డంకులు దాటుకుని.. కూటమి కుట్రలు ఛేదించి అతిరథ మహారథుల సమక్షంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడుగా భూమన కరుణాకరరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం అద్యంతం పండుగ వాతావరణంలో సాగింది.

వైఎస్సార్‌సీపీలో నయా జోష్!

- అట్టహాసంగా జిల్లా అధ్యక్షుని ప్రమాణ స్వీకారం
- వేలాదిగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు
- ఒకే వేదికను పంచుకున్న పార్టీ అతిరథ మహారథులు
- పార్టీ ముఖ్యులందరికీ సాదర స్వాగతం పలికిన మోహిత్‌రెడ్డి
- కూటమి నేతల దాడులు, దౌర్జన్యాలు, వైఫల్యాలపై ధ్వజం
- మూడు గంటలు సాగిన సభలో అద్యంతం జై జగన్ నినాదాలు



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతిరూరల్/ తిరుపతిఅర్బన్: వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఆదివారం తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురం పంచాయతీ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి తుడా మాజీ చైర్మన్, పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పార్టీ ముఖ్య నేతల ప్రసంగాలు కార్యకర్తల్లో సమరోత్సాహాన్ని నింపాయి. రానున్న రోజుల్లో కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని నొక్కి వక్కాణించడంతో కార్యకర్తల హర్షధ్వానాలతో సభాప్రాంగణం మార్మోగింది. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించుకునేలా 'గుడ్ బుక్'ను ప్రతి నియోజకవర్గంలో ఇన్‌చార్జిలు అమలు చేయాలని పలువురు చేసిన సూచనలు కూడా పార్టీ శ్రేణులను ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసినా ఓడిపోయామని కొందరు గట్టిగా కేకలు వేయగా.. మనం ఓడింది ప్రజల చేతిలో కాదని, ఈవీఎంలతో అని నేతలు వారికి సర్ది చెప్పారు. ఐదేళ్ల తర్వాత ఎన్నికలని కూర్చోవద్దని, 2027 చివరిలో మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వస్తాయని, అప్పుడు మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్న పిలుపునకు భారీ స్పందన లభించింది.

ఒకే వేదికపై అతిరథ మహారథులు

భూమన కరుణాకరరెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమం ఒకేవేదికపైకి రావడంతో కార్యకర్తలు సంబరపడ్డారు. బయట ప్రాంతంలో ఉండడంతో కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నానని, కరుణాకరరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సందేశం పంపించారు. దాదాపు 10 వేల మందికి పైగా హాజరైనట్లు సమాచారం. వైఎస్సార్ సీపీ రీజినల్ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సజ్జల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూమన అభినయ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న భూమన కరుణాకరరెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న పార్టీ నేతలు

ఒక్కడిని ఓడించేందుకు..

చంద్రబాబు పుట్టిన చంద్రగిరిలో 25 ఏళ్ల పిల్లోడు మోహిత్‌రెడ్డిని ఓడించేందుకు 25 మంది ఎమ్మెల్యే స్థాయి నేతలు పోటీపడ్డారు. లోకేష్, భువనేశ్వరి ఇక్కడే తిష్టవేశారు. పులివర్తి నాని, సుధారెడ్డి, వినీల్ సభలు మీద సభలు పెట్టారు. మబ్బు రామిరెడ్డి కొడుకు పెద్దబ్బ చంద్రగిరికి వచ్చి మరీ పనిచేశాడు. దేవర మనోహర్ లాంటి వారు తన భార్య నగలను కూడా అమ్మి ఖర్చు చేశారు. పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్, మేడసాని పురుషోత్తం నాయుడు, డాలర్ దివాకర్‌రెడ్డి, రెడ్డివారి ప్రీతమ్‌రెడ్డి ఇంటింటికీ తిరిగారు. ఆల్‌వేస్ అధికార పార్టీ నేత ఎంఆర్‌సీ రెడ్డి, ఓట్లు తగ్గితే అనుమానం వస్తుందని గల్లా అరుణకుమారి, ప్రముఖ సినీనటుడు మోహన్‌బాబు టీం మాతో బాగుంటూనే టీడీపీ గెలవడానికి కృషి చేశారు. వ్యాపార మాంత్రికుడు రమణమూర్తి కూడా పనిచేశారు. **- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

కార్యకర్తలే మా బలం

భూమన కరుణాకరరెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయం. ఆయన నాయకత్వ పటిమను చూస్తూ..ఎదిగిన మాలాంటి వాళ్లకు ఆయన ఆదర్శ నాయకుడు. కార్యకర్తలే మా బలం. కార్యకర్తలను ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోం. చంద్రగిరి నుంచే తిరుగుబాటు ప్రారంభిందాం. **- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త**

ఈవీఎంలతో ఏదో జరిగింది

వైఎస్ జగన్ పరిపాలనలో అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. తిరుపతి నగరాన్ని భూమన కరుణాకరరెడ్డి ఎంతో అభివృద్ధి చేశారు. ఈవీఎంలతో ఏదో జరిగింది. దాంతోనే ఓటమి పాలయ్యాం. **-విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త**

పార్టీని బలోపేతం చేద్దాం

మరోసారి గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేద్దాం. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిద్దాం. రాష్ట్ర అభివృద్ధికి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాల్సి ఉంది. **- శ్రీనివాసులు, జిల్లా పరిషత్ చైర్మన్, చిత్తూరు**

నన్నెంతో గౌరవించారు

తిరుపతి కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తొలిసారిగా చైర్మన్ జనరల్ అయినప్పటికీ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ మహిళగా తమకు చైర్మన్ అవకాశం కల్పించారు. అందుకు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అండగా నిలిచారు. ఇప్పుడాయన వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా నియమించడం ఎంతో సంతోషంగా ఉంది. **- డాక్టర్ శిరీషా, మేయర్, తిరుపతి నగరం**

అవినీతిని రాసుకోండి

భూమన కరుణాకరరెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి వచ్చిన అభిమానులను చూస్తుంటే మనమే అధికారంలో ఉన్నట్లుగా ఉంది. మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్‌లో వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు కాకుండా టీడీపీకి చెందిన ఎమ్మెల్యేల అవినీతిని రాసుకోవాలి. **- బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త**

పోలీసులంటే లెక్కలేనితనం

టీడీపీ కూటమి నేతలకు పోలీసులంటే లెక్కలేకుండా పోయింది. దీంతోనే ఇష్టారాజ్యంగా లైంగికదాడులు, హత్యలకు పాల్పడుతున్నారు. చంద్రబాబు పాలన నేరాలు...ఘోరాలతోనే గడిచిపోయేలా ఉంది. **-నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త**

ధైర్యం నా పెట్టుబడి

నేను కార్యకర్తల మనిషిని. ధైర్యం నా పెట్టుబడి, పోరాటం నా ఊపిరి. పోరాటంలోనే పెరిగా...కార్యకర్తల కోసమే నిలబడతా.. గ్రూపులు కట్టడానికి రాలేదు. నా నాయకత్వాన్ని బలపరిచే కార్యకర్తలందరినీ ఏకతాటిపై నడిపించడానికి ఒక ముఖ్య కార్యకర్తగా మాత్రమే నన్ను జగనన్న నియమించారు. నాయకులను కలుపుకుంటూ జిల్లాకు ముఖ్యనాయకుడు పెద్దిరెడ్డి సూచనలు, సలహాలను పాటిస్తూ అందరికీ మేలు జరిగేలా చూస్తా. **-భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు**

రెడ్‌బుక్ చాప్టర్లు విడ్డూరం

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ చాప్టర్లు చెప్పడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో శ్రద్ధ చూపడంలేదు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష్య సాధించడంలో శ్రద్ధ చూపుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు ఏమీ నెరవేర్చారనే అంశాలపై చర్చించకుండా రెడ్‌బుక్ విధానాలను ఎలా అమలు చేయాలని ఆలోచన చేయడం ఆశ్చర్యంగా ఉంది. **- మద్దిల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి**

ఏం చేశాం... ఇకపై ఏం చేస్తామో చెప్పండి

కూటమి సర్కార్ ఇప్పటివరకు ఏం చేసిందో చెప్పాల్సి ఉంది. అలాగే ఏం చేస్తామో ప్రజలకు వివరించాల్సి ఉంది. తల్లికి వందనం ఇచ్చా రా...? అన్నదాత సుఖీభవ అమలు చేస్తారా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1500 ఇస్తున్నారా...వాటిపై మాట్లాకుండా వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదు. **- ఆర్కే రోజా, మాజీ మంత్రి**

ప్రజల దృష్టి మళ్లించడానికే ఆరోపణలు

ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వైఎస్సార్‌సీపీపై పలు ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి అనవసర విషయాలను చంద్రబాబునాయుడు లేవనెత్తుతున్నారు. పిల్లను ఇచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు. ఆయన పార్టీని, ఆయన గుర్తును లాక్కొని ఈయన పెత్తనం చేస్తున్నారు. **-కళత్తూరు నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం**

కలసికట్టుగా పనిచేద్దాం

భూమన నేతృత్వంలో అన్ని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు విజయం సాధించడానికి కలిసికట్టుగా పనిచేద్దాం. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని భూమన నడిపిస్తారని భావిస్తున్నాం. **- డాక్టర్ సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ, పూతలపట్టు సమన్వయకర్త**

మోసంతోనే కూటమికి అధికారం

ఈవీఎంల మోసంతోనే టీడీపీ కూటమికి అధికారం వచ్చింది. దేశంలో ఏ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టినన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. ప్రజలు ఓట్లు వేశారు. అయితే ఏదో మాయ చేశారు. **-కృపాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు సమన్వయకర్త**



సభలో కేరింతలు పెడుతున్న యువకులు

అపార్.. కష్టం సర్

- విద్యార్థులకు 'ఇంటి పేరు'తో సమస్యలు
- టీసీ, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌లో 'సర్ నేమ్' దోషాలు
- ఆధార్ సెంటర్లకు పరుగులు
- ఆధార్‌లో మార్పులకు అధికంగా డబ్బులు వసూలు

కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు జారీ చేయనున్న అపార్ ఐడీ కార్డులు





పలమనేరు: కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్- వన్ స్టూడెంట్ ఐడీ పేరిట మినిస్ట్రీ ఫర్ ఎడ్యుకేషన్ అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పోర్టల్‌లో విద్యార్థి వివరాలను తెలిపే రిజిస్ట్రేషన్ ప్రక్రియను గతేడాది సెప్టెంబరులో ప్రవేశపెట్టింది. ఇందులో రిజిస్టర్ అయిన విద్యార్థులు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా కాన్వొకేషన్ లేకుండా కేవలం 12 అంకెల ఐడీ ఆధారంగా ఉన్నత చదువు అభ్యసించే అవకాశం ఉంటుంది. విద్యార్థి బడిలో చేరినప్పటినుంచి అన్ని అకడమిక్ వివరాలు, వ్యక్తిగత, కుటుంబీకుల చిరునామా, మార్కుల జాబితాలు, టీసీ తదితరాలు ఇందులోనే అప్‌లోడ్ అయి ఉంటాయి. దీంతో ఏ రాష్ట్రంలోకి వెళ్లి ఏ కళాశాలలో చేరినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసించుకొనే అవకాశం ఉంటుంది.

జిల్లాలోని పాఠశాలలు

విద్యార్థులు మొత్తం	1,14,599
అప్పర్ ప్రైమరీ విద్యార్థులు మొత్తం	75,688
సెకండరీ పాఠశాల విద్యార్థులు	46,382
మొత్తం విద్యార్థులు జిల్లాలోని జూనియర్	2,36,669
కళాశాలలో మొత్తం విద్యార్థులు	35 వేలు

కిక్కిరిసిపోతున్న నెట్ సెంటర్లు

పది రోజుల క్రితం ఆయా హెచ్‌ఎంలకు అందిన ఆదేశాలతో అపార్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే సాంకేతిక లోపాల కారణంగా ఆన్‌లైన్ నమోదు ఆలస్యమవుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు టార్గెట్ ఇచ్చి మరీ దీన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. ఫలితంగా పెద్దసంఖ్యలో తప్పులున్న వాళ్లు జిల్లాలోని ఆధార్, నెట్, మీసేవా కేంద్రాల వద్ద కిక్కిరిసిపోతున్నారు. డిమాండ్‌ను గమనించిన నిర్వాహకులు ఆధార్ అప్‌డేట్‌కు రూ.150 నుంచి రూ.200, బర్త్ సర్టిఫికెట్‌కు రూ.300 నుంచి రూ.500 ఇలా ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకు 30 శాతం మాత్రమే

ఇప్పటిదాకా ప్రైమరీ పాఠశాలలో 36 శాతం, అప్పర్ ప్రైమరీలో 23 శాతం, సెకండరీ పాఠశాలల్లో 23 శాతం ఓవరాల్‌గా పూర్తయింది 30 శాతం మాత్రమే. ఎందుకంటే జిల్లా వ్యాప్తంగా మరో 30 శాతం మందికి ఆన్‌లైన్‌లో ఏదో ఒక ఎర్రర్ కనిపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్సెస్ కావడంలేదు. దీంతో పాటు ఆధార్‌లో తప్పులు దిద్దడం, ఇతర అవసరమైన సర్టిఫికెట్ల మంజూరుకు ప్రైవేట్ సేవా కేంద్రాల్లో తీసుకోవాల్సిన రుసుంపై జిల్లా కలెక్టర్ పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని, ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదే సచివాలయ సేవలుండి ఉంటే..

గత ప్రభుత్వంలో సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు ఉచితంగానే ఆధార్ అప్‌డేట్‌లు, తప్పులను సరిచేసే ప్రక్రియను చేసేవారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక సచివాలయ సేవలను రద్దుచేసింది. పూర్తిగా సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేసింది. దీంతో ప్రజలు డబ్బులు చెల్లించి ఆధార్ సేవలను పొందాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రైవేటు వారి సేవలు కాబట్టి ప్రస్తుత డిమాండ్‌ను బట్టి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేసుకుంటున్నారు.

సమస్య ఎక్కడంటే...

తల్లిదండ్రులు ప్రాథమిక పాఠశాలలో పిల్లలను చేర్చేటప్పుడు అప్పటికి అవసరమైన వివరాలతో అడ్మిషన్ చేశారు. తరువాత కొన్నేళ్లకు ఆధార్ కార్డుల జారీ ఆరంభమైంది. అప్పుడు టీసీలో తండ్రి పేరు ముందు సర్‌నేమ్(ఇంటిపేరు) నమోదు చేశారు. అయితే ఆధార్‌లో లేదు. ఇప్పుడు అపార్ రిజిస్ట్రేషన్ కోసం పాఠశాలలోని అకడమిక్ రిజిస్టర్, ఆన్‌లైన్ రిపోర్ట్, ఆధార్‌లోని అన్ని వివరాలు మ్యాచ్ అయితేనే ఆ విద్యార్థికి ఐడీ వస్తుంది. కానీ ఈ ప్రక్రియలో సగం మందికి సర్టిఫికెట్లు, ఆధార్‌లోని వివరాల్లో తేడాల కారణంగా సర్టిఫికెట్లు అప్‌లోడ్ కావడం లేదు. దీంతో టీచర్లు టీసీలోని వివరాల మేరకు ఆధార్‌లో మార్పులు చేసుకు రావాలని పిల్లలకు సూచిస్తున్నారు. ఫలితంగా వీరు ఆధార్ సెంటర్లు, ఆన్‌లైన్ కేంద్రాలు, మీసేవా సెంటర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

బైరెడ్డిపల్లె మండలానికి చెందిన వెంకటేష్ టీసీలో ఓబన్నగారి వెంకటేష్ అని ఉంది. బర్త్ సర్టిఫికెట్‌లో వెంకటేష్‌గా ఉంది. ఆధార్‌లో ఓ వెంకటేష్‌గా ఉంది. ఫలితంగా అపార్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సిస్టం వీటిని అనుమతించలేదు. దీంతో అతని అప్లికేషన్ రిజెక్ట్ అయింది. టీచర్లు ఆ బాలుడిని పిలిచి ఆధార్‌లో సర్ నేమ్ అప్‌డేట్ చేసుకు రావాలని సూచించారు. దీంతో ఆ బాలుడు తన తండ్రిని వెంట బెట్టుకుని ఆధార్ సెంటర్‌కు వెళ్లారు. దాన్ని సరిచేసేందుకు రూ.200, బర్త్ సర్టిఫికెట్‌కు రూ.300 తీసుకున్నారు. ఇలా ఆధార్‌లో పొరపాట్లున్న వారు పలమనేరు నియోజకవర్గంలోనే 3 వేల మందికి పైగా ఉండడం గమనార్హం.

అపార్‌పై ప్రత్యేక దృష్టి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు అపార్ నమోదుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కసరత్తుపై ఎంఈఓలు, హెచ్‌ఎంలు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించామన్నారు. అపార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం జీవితకాల గుర్తింపు కార్డును ఇచ్చేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. అపార్ ఐడీతో నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట పడుతుందన్నారు. చిన్నచిన్న లోపాలను అధిగమించి జిల్లాలోని ప్రతి పాఠశాల వంద శాతం నమోదు పూర్తి చేయాలని డీఈఓ ఆదేశించారు.

బరి తెగించిన టీడీపీ నాయకులు

- వేరొకరి స్థలాన్ని ఆక్రమించి రోడ్డేసుకున్న వైనం
- అడిగిన స్థల యజమానులపై దాడి



టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ శివాజి



వేరొకరి స్థలం ఆక్రమించి, టీడీపీ నాయకుల ఇంటికి వేసిన సీసీ రోడ్డు

గంగవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలు బరితెగించేస్తున్నారు. వేరొకరి స్థలాన్ని ఆక్రమించి, తమ ఇంటి వరకు సీసీ రోడ్డు వేసుకున్న టీడీపీ నేతలు, స్థల యజమానులపై దాడికి పాల్పడ్డారు. మండలంలోని దండపల్లి పంచాయతీ ఎగువ వేమనపల్లిలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు, గ్రామంలో బాలాజి, శివాజి వాళ్ల తాత గుర్రప్ప పేరుమీద సర్వే నెంబర్ 926/1ఐ, 926/2లో మొత్తం 80 సెంట్ల భూమి ఉంది. అందులోని కొంత స్థలంపై కన్నేసిన టీడీపీ నాయకులు నెల క్రితం దాన్ని ఆక్రమించి, వాళ్ల ఇంటి వరకు సీసీ రోడ్డు వేసేందుకు పూనుకున్నారు. అయితే ఈ విషయాన్ని తెలుసుకున్న స్థల యజమానులు తమ స్థలంలో రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. దీంతో వారిని టీడీపీ నాయకులు విచక్షణా రహితంగా చావబాదారు. వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు బాధితులు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. గత్యంతరం లేక బాధితులు కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. అయినా టీడీపీ నాయకులు కోర్టు ఆర్డర్‌ను సైతం ధిక్కరించి అదే స్థలంలో సొంత డబ్బుతో తమ ఇంటి వరకూ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేశారు. ఈ విషయమై ప్రశ్నించిన బాధితులు బాలాజి, శివాజీపై టీడీపీ నేతలు శంకరప్ప, క్రిష్ణప్ప, యల్లప్ప, మురళి కుటుంబసభ్యులు కలిసి బాధితులపై ఆదివారం మరోసారి దాడి చేశారు. ఆ ఘటనలో శివాజీకి తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

పూతలపట్టులో మరో చైన్ స్నాచింగ్

పూతలపట్టు: మండలంలో ఆదివారం చైన్ స్నాచింగ్ సంఘటన చోటుచేసుకుంది. సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు మండలంలోని తిమ్మిరెడ్డిపల్లె జగనన్న కాలనీకి చెందిన భారతి ఆదివారం ఉదయం తన ఇంటి పనుల్లో ఉండగా, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె చేతులను వెనుకకు గట్టిగా పట్టుకొని అరిచి గోలచేస్తే చంపేస్తానని బెదిరించి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. అనంతరం బాధితురాలు పోలీస్ స్టేషన్ ఆశ్రయించగా, పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 26న జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలో ఐరాల మండలానికి చెందిన ప్రమీల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే.

మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా



మొగిలి ఘాట్‌లో బోల్తాపడిన లారీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం లారీ అదుపు తప్పి బోల్తాపడింది. పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ మొగిలి ఘాట్ వద్ద బ్రేక్ ఫెయిల్ అయ్యింది. లారీని అదుపుచేసే క్రమంలో రహదారి పక్కకు వెళ్లడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకుని, స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మొగిలి ఘాట్‌లో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురికావడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళనకు గురైతున్నారు.

టెంపో ఢీకొని యువకుడి మృతి

శాంతిపురం: మండలంలో టెంపో ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కుప్పం–పలమనేరు జాతీయ రహదారిపై రామకుప్పం మండలం, యానాదికాలనీకి చెందిన షణ్ముగం(23) బైక్‌పై వెళుతున్నాడు. తులసినాయనపల్లి సమీపంలో ఏపీ మోడల్ స్కూలు ఎదుట టమాటా లోడ్‌తో కుప్పం వైపు వెళ్తున్న టెంపో ఆ బైక్‌ను ఢీకొంది. దీంతో ఆ యువకుడి తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఢీ కొట్టి వెళ్లిపోతున్న టెంపోను కుప్పం డిగ్రీ కళాశాల వద్ద అడ్డగించి పట్టుకున్నారు. నెంబరు లేని కొత్త హీరో బైక్‌పై శ్రీ సాయి మోటార్స్, వి.కోట అని ఉండడంతో దాని ఆధారంగా మృతుడి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

- "జూలై.. తిరుపతి జిల్లా నాయుడుపేట పరిధిలోని దొరవారిసత్రం ఎనిమిదేళ్ల బాలికను ఈ నెల 17న కిడ్నాప్ చేశారు. ఇంట్లో ఆడుకుంటున్న బాలికను తీసుకెళ్లి, బాలికపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితుడు ఎవరో కాదు.. బాధిత బాలిక తండ్రికి స్నేహితుడే. తండ్రి స్నేహితుడు కావడంతో నమ్మి వెళ్లినందుకు ఈ దురాగతానికి పాల్పడ్డాడు."
- "జూలై.. చిత్తూరులో తన వద్ద పనిచేసే మైనర్ బాలికపై ఆర్ఎంపీ వైద్యుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో అతను పలుమార్లు బాలికపై లైంగికదాడికి పాల్పడటంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆర్ఎంపీ వైద్యుడ్ని పోలీసులు అరెస్టు చేసినా, జరగాల్సిన నష్టం జరిగిపోయింది."
- "అక్టోబర్.. పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి తప్పిపోయింది. తొలుత మిస్సింగ్ నమోదుచేసిన పోలీసులు, దర్యాప్తు పూర్తిచేసేలోపు పాప శవమై తేలింది. ఆర్థిక లావాదేవీలు ఈ హత్యకు కారణంగా చెబుతున్నా, పోయిన ప్రాణం తిరిగి రాలేదు."
- "నవంబర్.. వడమాలపేటలో మూడేళ్ల చిన్నారిని నమ్మించి వెంట తీసుకెళ్లిన రాక్షసుడు, తినడానికి అవీఇవీ కొనిచ్చి దారుణానికి పాల్పడ్డాడు. విషయం బయట తెలిసిపోతుందని చిన్న బిడ్డ గొంతునులిమి చంపేశాడు.

పసి మొగ్గలపై మృగాళ్ల పంజా

అమ్మ లాలన తప్ప ఏమీ ఎరుగని పసి మొగ్గలను నలిపేస్తున్నారు. చిరుతిండి కోసం చేయి చాచే కూనలపై పంజా విసురుతున్నారు. తెలిసిన వాళ్లే తోడేళ్లుగా మారి చిన్నారులను చిదిమేస్తున్నారు. అందగా ఉంటారనుకుంటే అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఏ మాత్రం లోకజ్ఞానం లేని బాలికలను ఎంచుకుని కాటేస్తున్నారు. తనకు ఏం జరుగుతోందో కూడా తెలుసుకోలేని అమాయకపు చూపుల్లో నెత్తురు పారిస్తున్నారు. గంజాయి మత్తులో రాక్షసులుగా మారి బాలికల రక్తం తాగుతున్నారు. కామాంధుల పైశాచికత్వానికి పసికందులు బలైపోతున్నారు. అమ్మతనాన్ని బాల్యంలోనే పాతిపెట్టేస్తున్న ఈ సమాజానికి కనువిప్పు కలిగించేదెవరు?

- చిన్నారులను చిదిమేస్తున్న కామాంధులు
- జిల్లాలో పెరుగుతున్న పిల్లలపై అఘాయిత్యాలు
- పిల్లలసంరక్షణపై తల్లిదండ్రుల్లో ఆందోళన



చిత్తూరు అర్బన్: జిల్లాలో గత కొన్ని నెలలుగా పసి పిల్లలపై జరుగుతున్న ఈ అఘాయిత్యాలు తల్లిదండ్రుల్ని ఆందోళనలో పడేస్తోంది. అసలు పిల్లల్ని ఇంటి నుంచి బయటకు పంపాలంటే భయపడిపోయే పరిస్థితులు వస్తున్నాయి. నవమాసాలు మోసి, కన్న తల్లి ఆవేదన.. అల్లారు ముద్దుగా చూసుకున్న తండ్రి ప్రేమ రెండింటినీ సమాధి చేసే రాక్షసులు మన చుట్టూ చేరి, మనతోనే తిరుగుతూ పిల్లలపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చేసిన తప్పు రుజువైతే న్యాయస్థానం శిక్ష విధిస్తుంది. కాకుంటే నిందితుడు దర్జాగా బయటకు వచ్చేస్తాడు. కానీ పోయిన ప్రాణం మాత్రం ఎప్పటికీ రాదు.

తెలిసిన వాళ్లే తోడేళ్లు

పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యల్లాంటి కేసుల్లో నిందితులు ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడటంలేదనే విషయం తల్లిదండ్రులు గుర్తించుకోవాల్సిన విషయం. 90 శాతం కేసుల్లో నేరాలకు పాల్పడింది బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులకు స్నేహితులు, ఎదురింటి వాళ్లు, పక్కింటి వాళ్లు కావడం ఆలోజింపచేస్తోంది. పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడే ఘటనల్లో నిందితులుగా ఉన్నవాళ్లు, బాధితులకు బాగా పరిచయమైన వాళ్లు, దగ్గరివాళ్లగా ఉంటున్నారు. మనతో ఉన్న ఆర్థిక లావాదేవీలు, చిన్న పాటి తగాదాలను పిల్లలపై చూపించి కర్కశంగా ప్రవర్తిస్తున్నారు. కొన్ని ఘటనల్లో పేరెంట్స్‌తో ఎలాంటి తగాదాలు లేకున్నా, పిల్లలపై కన్నేసి మాయమాటలు చెప్పో, లేనిపోనివి ఆశ చూపించో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. తరచూ ఇంటికి వస్తూపోతూ ఉండటం, పిల్లల్ని వక్ర బుద్ధితో తాకుతూ ఆనందించడం చేస్తుంటారు. పిల్లలు ఏది ఇష్టపడుతారో, దాన్ని వాళ్లకు ఆశ చూపించి క్రమంగా బయటకు తీసుకెళ్లడం చేస్తుంటారు. తల్లిదండ్రులు కూడా ఆ మృగాలపై నమ్మకం పెంచుకున్నాక, పిల్లల్ని ఒంటరిగా ఎవరూ లేని సమయం చూసుకుని క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. అసలు బయటి వ్యక్తులకు పిల్లలతో ఏం పని..? అని ఒక్క ప్రశ్న వేసుకోవడంతో సగం కాపాడుకున్నట్టే అవుతుంది. అంతటితో ఆగకుండా పిల్లలకు ఏది మంచి–చెడు అని వాళ్ల స్థాయిలో చిన్న పాటి విషయాలు కచ్చితంగా చెప్పాలి.

మత్తుకు బానిసలై

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో పట్టణ, గ్రామీణ మండలాల్లో యువకులు అత్యధికంగా గంజాయి మత్తుబారిన పడుతున్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలకన్నా గంజాయి ప్రభావం అత్యధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల పోలీసులు తగు చర్యలు తీసుకొని విక్రయాలు సమూలంగా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రెండేళ్ల కిందట నగరి పట్టణంలోని రామాపురం క్రషర్ గుంటలో ఐదుగురు యువకులు మద్యం మత్తులో ఓ వ్యక్తిని అత్యంత పాశవికంగా హత్య చేశారు. నగరి మండల పరిధిలోని తడుకుపేట సమీపంలో 20 రోజుల క్రితం గంజాయి మత్తులో ఉన్న యువకులు ఓ దంపతులకు కత్తి చూపి బెదిరించి నగదును లాక్కెళ్లారు. అదే మండలంలోని నాగరాజుకుప్పం వద్ద గంజాయి విక్రయిస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు.

అందుబాటులో జీపీఎస్

పిల్లల్ని కాపాడుకునే విషయంలో సాంకేతిక పరిజ్ఞానం చాలానే సాయపడుతోంది. ఇపుడు రూ.వెయ్యిలోపే ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో జీపీఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) పరికరాలు దొరుకుతున్నాయి. పిల్లల చేతికి పెట్టే వాచీల్లో, మెడలో వేసుకునే గొలుసులు, కాళ్లకు వేసుకునే చెప్పులు ఇలా ఎక్కడైనా ఇమిడిపోయే జీపీఎస్ ట్రాకర్ పరికరాలు చాలానే అందుబాటులో ఉన్నాయి. ఇవి ఎలా పనిచేస్తాయి? ఎందుకు ఇస్తున్నామనే విషయం పిల్లలకు స్పష్టంగా చెప్పడం వల్ల ఇలాంటి దారుణాల నుంచి రక్షించుకునే అవకాశం ఉంది. తల్లిదండ్రులు ఇంటికి రావడం ఆలస్యమైనా, పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సమయంలో పేరెంట్స్ లేకున్నా, పిల్లల్ని ఎవరైనా బయటకు తీసుకెళ్లినా ఎక్కడున్నారనే విషయాన్ని జీపీఎస్ ద్వారా పసిగట్టేయచ్చు. ఇందులోనే ఫెన్సింగ్ ఆప్షన్ ఉన్న పరికరాలు కూడా ఉన్నాయి. మన ఇంటి నుంచి వంద మీటర్ల పరిధిని ఎంపిక చేసుకోవడం, దాన్ని పిల్లలు దాటితే అలారం మోగేలా చేయడం, అత్యవసర పరిస్థితుల్లో అలారం మోగించడం ఇలా పలు రకాల పరికరాలు పిల్లల్ని కాపాడే అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి



ఆడ పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే ఎవ్వరిని నమ్మడానికి లేదు. చాలా మంది యువకులు మద్యానికి బానిసలై, విచ్చలవిడిగా తిరుగుతున్నారు. వారు ఏమి చేస్తున్నారో వారికే తెలియడం లేదు. ఆడ పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి యువకులు ఉన్న చోటకు పంపకూడదు.

– రాజేశ్వరి, బట్టికండ్రిగ, వడమాలపేట

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



మత్తు పదార్థాలపై ప్రత్యేక చట్టం తీసుకురావాలి. గంజాయి, మద్యంపై ప్రత్యేక దృష్టి పెడితే ఇలాంటి సంఘటన జరగకుండా ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి, చెడు అలవాటుకు దూరంగా ఉండేలా చూసుకోవాలి. మత్తు పదార్థాల నివారణపై యువతకు అవగాహన కల్పించాలి.

– జయలక్ష్మి, ఏఎం పురం

దిశ చట్టం తీసుకురావాలి

రాష్ట్రంలో ఆడవారిపై లైంగిక దాడి నియంత్రణకు ప్రభుత్వం దిశ చట్టాన్ని అమలు చేయాలి. అప్పుడే ఆడవారిపై దాడి చేయాలన్న ఆలోచన రాదు. ఇది రాజకీయ కోణంలో చూడకూడదు. మానవ కోణంలో ఆలోచించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

– మునివేలు, ఎంపీపీ, పుత్తూరు

ఏపీపీడీఈఏ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్ అసోసియేషన్ (ఏపీపీడీఈఎ) జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. చిత్తూరులోని విద్యుత్ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వివరాలను తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడిగా నరసింహారెడ్డి(వాణిజ్య ఏఈ పుంగనూరు), జిల్లా కార్యదర్శిగా వివేకానందరెడ్డి(గిరింపేట, ఏఈ చిత్తూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజా (వాణిజ్య ఏఈ, చిత్తూరు), కోశాధికారిగా రమేష్‌బాబు(జేఈ ఎంఆర్‌టీ, చిత్తూరు), మహిళ కార్యనిర్వాహక కార్యదర్శిగా నీరజ (ఏఈ ఆపరేషన్ ఐరాల)ను ఎంపిక చేశారు. వీరితో పాటు చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యదర్శిగా బాలాజీ(ఏఈ రూరల్స్, ఐరాల), కార్యనిర్వాహక కార్యదర్శిగా గురప్ప (ఏఈ, యాదమరి), కోశాధికారిగా శివకుమార్(జేఈ మిట్టూరు, చిత్తూరు), చిత్తూరు రూరల్స్ డివిజన్ కార్యదర్శిగా బాలచంద్ర (ఏఈ, నగరి), కార్యనిర్వాహక కార్యదర్శిగా రంగనాథయ్య (ఏఈ, వెదురుకుప్పం), కోశాధికారిగా వరదరాజులు(ఏఈ, జీడీనెల్లూరు), పుంగనూరు డివిజన్ కార్యదర్శిగా ధనంజయమూర్తి(ఏఈ రూరల్స్, పుంగనూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా అర్జున(ఏఈ రూరల్స్, పలమనేరు), కోశాధికారిగా చంద్రశేఖర్(ఏఈ, సదుం)ను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరు 2026 వరకు పదవికాలంలో ఉంటారని అసోసియేషన్ డిస్కం సలహాదారుడు సాయిసుధాకర్ తెలియజేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని సభ్యులు వివరించారు.

కిటకిటలాడిన బోయకొండ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసి పోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు యత్నించిన సంఘటనలు ఆదివారం వెలుగు చూశాయి. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఉమాదేవి (45) అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఇంటిలోనే పురుగుల మందుతాగింది. చౌడేపల్లె మండలం కాటిపేరికి చెందిన నౌషాద్‌బాషా (36) అప్పులు చేశాడు. వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఇంట్లో పురుగులు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇద్దరినీ కుటుంబ సభ్యులు గమనించి పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



పూతలపట్టులో నిర్వహించిన ర్యాలీలో యూటీఎఫ్ నాయకులు

పూతలపట్టు: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వారి జిల్లా స్థాయిలో స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో స్వర్ణోత్సవ జెండాలను పట్టుకొని ర్యాలీని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సీఎంసీ ఆస్పత్రిలో రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పిస్తానని, ఉపాధ్యాయులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విద్యారంగంలో అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద బిడ్డలకు న్యాయమైన, నాణ్యమైన విద్యను అందించడానికి వాతావరణ బోధనేతర పనులను రద్దుచేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు తన బోధన సమయంలో మొబైల్ ఫోన్‌ను పూర్తిగా విద్యార్థులకు విద్యను బోధించాలని యూటీఎఫ్ సభ్యులు తీర్మానం తీసుకున్నారు. యూటీఎఫ్ పతకావిష్కరణ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో సభా ప్రాంగణం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు జీవీ రమణ, ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మునిరత్నం, రెహానా బేగం, జగన్‌మోహన్‌రెడ్డి, సురేష్, సీఐటీయూ అధ్యక్షులు గంగరాజు, మండల యూటీఎఫ్ అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన మద్యం నిందితులతో పోలీసులు

శాంతిపురం: కర్ణాటక నుంచి గుడుపల్లె మండలానికి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని రాళ్లబూదుగూరు పోలీసులు పట్టుకున్నారు. కుప్పం–కేజీఎఫ్ రోడ్డులోని గెనికపల్లి వద్ద ఆదివారం ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక మద్యాన్ని ద్విచక్ర వాహనాలపై తీసుకువస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 2,880 ప్యాకెట్ల 90 ఎంఎల్, 144 క్వార్టర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.1,23,360 ఉంటుందని పోలీసులు లెక్క తేల్చారు. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు గుడుపల్లె మండలం కనమనపల్లెకు చెందిన కె.సత్యవేలు(27), ఎం, గిరీష్(33)గా గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండి, క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 88,076 మంది స్వామివారిని దర్శించుకోగా 38,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

జిల్లా విద్యుత్ శాఖకు సెక్షన్ల కేటాయింపు

- 3 డివిజన్లు, 40 సెక్షన్లతో ఎస్ఈ కార్యాలయం
- మారనున్న పూతలపట్టు సెక్షన్?



చిత్తూరులోని ఎస్ఈ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా విద్యుత్‌శాఖ పునఃవ్యవస్థీకరణ పనులు పూర్తయ్యాయి. తిరుపతి నుంచి వేరు చేసి చిత్తూరులో ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. మొదట ఎస్ఈ కార్యాలయం కేటాయించిన డివిజన్లు, సబ్‌డివిజన్లు, సెక్షన్ల పరంగా ఏవి వస్తాయో స్పష్టత లేదు. ప్రస్తుతం ఎస్ఈ పరిధిలో 3 డివిజన్లు, 10 సబ్‌డివిజన్లు, 40 సెక్షన్లను కేటాయిస్తూ సీఎండీ సంతోష రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చిత్తూరు రూరల్ కార్యాలయంలోనే రూరల్, ఎస్ఈ కార్యాలయ సేవలు కొనసాగుతున్నాయి. రూరల్ కార్యాలయానికి పాత కలెక్టరేట్‌లో భవనం కేటాయించగా వాటిని శాఖకు అనుగుణంగా మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. ఆ పనులు పూర్తయితే డివిజన్ కార్యాలయంలో సేవలు సజావుగా సాగుతాయని అధికారుల అంచనా.

25 మంది ఉద్యోగులు సర్దుబాటు

నూతన ఎస్ఈ కార్యాలయం ఏర్పడడంతో తిరుపతి సర్కిల్ కార్యాలయంలో స్కిల్డ్ ఉద్యోగులు 36 మంది, అన్‌స్కిల్డ్ ఉద్యోగులు 15 వంతున మొత్తం 51 మంది ఉన్నారు. ఇందులో చిత్తూరు సర్కిల్‌కు స్కిల్డ్ ఉద్యోగులు 18 మంది, అన్‌స్కిల్డ్ ఉద్యోగులు ఏడుగురు అంటే మొత్తం 25 మందిని ఇక్కడికి సర్దుబాటు చేయడానికి అంగీకారం తెలిపారు.

మూడు డివిజన్లతో సర్కిల్

సర్కిల్ కార్యాలయాన్ని పుంగనూరు, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ డివిజన్లతో కలిపి ఏర్పాటు చేశారు. చిత్తూరు అర్బన్, రూరల్ నుంచి కొన్ని సెక్షన్లు పరస్పరం మార్చారు. పుత్తూరు డివిజన్‌లోని కొన్ని సెక్షన్లు చిత్తూరు రూరల్ డివిజన్‌లో కలిపారు. మిగిలిన సెక్షన్లను అలాగే పుత్తూరు డివిజన్‌లో ఉంచి తిరుపతి సర్కిల్‌కు వాటిని కలిపారు. పుంగనూరు డివిజన్‌లోని సదుం సబ్‌డివిజన్‌లో కలికిరి, రొంపిచెర్ల, సదుం, సోమల, పుంగనూరు రూరల్ సబ్‌డివిజన్‌లో పుంగనూరు ఈస్ట్, పుంగనూరు, చౌడేపల్లె, పెద్దపంజాణి, పలమనేరు సబ్‌డివిజన్‌లో బైరెడ్డిపల్లె, పలమనేరుటౌన్, పలమనేరు రూరల్, వి.కోట సెక్షన్లు ఉంటాయి. ఈ డివిజన్‌ను అలాగే ఉంచి ఎటువంటి మార్పులు చేయలేదు. చిత్తూరు అర్బన్ డివిజన్‌లో చిత్తూరు అర్బన్ సబ్‌డివిజన్ పరిధిలో గిరింపేట, కొంగారెడ్డిపల్లె, మిట్టూరు, సంతపేట, చిత్తూరు రూరల్ –3 సబ్‌డివిజన్ పరిధిలో చిత్తూరు రూరల్, కొత్తపల్లె, రెడ్డిగుంట, చిత్తూరు రూరల్–1 సబ్‌డివిజన్‌లో బంగారుపాళెం టౌన్, బంగారుపాళెం రూరల్, యాదమరి, పైపల్లె సబ్‌డివిజన్‌లో అరగొండ, ఐరాల టౌన్, ఐరాల రూరల్, పైపల్లె సెక్షన్లు వస్తాయి. చిత్తూరు రూరల్ సబ్‌డివిజన్ పరిధిలో ఆవలకొండ, జీడీనెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు, పూతలపట్టు, కార్వేటినగరం సబ్‌డివిజన్‌లో కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, నగరి సబ్‌డివిజన్‌లో పానూరు, నగరి టౌన్, నగరి రూరల్, నింద్ర సెక్షన్లు ఉంటాయి. మొత్తం 3 డివిజన్లు, 10 సబ్‌డివిజన్లు, 40 సెక్షన్లతో సర్కిల్ కార్యాలయ పరిధిని నిర్దేశించారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌లోని రూరల్–2, పుత్తూరు డివిజన్‌లోని నగరి, కార్వేటినగరం సబ్‌డివిజన్లను చిత్తూరు రూరల్ డివిజన్‌కు మార్చారు. అలాగే చిత్తూరు అర్బన్ డివిజన్‌కు చిత్తూరు రూరల్ డివిజన్‌లోని రూరల్–1, పైపల్లె సబ్‌డివిజన్లను కలిపారు.

గందరగోళంగా మార్పులు

పరిపాలన సౌలభ్యం కోసం చిత్తూరులో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. కానీ సెక్షన్ల మళ్లింపు గందరగోళంగా ఉందని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. చిత్తూరు రూరల్ సబ్‌డివిజన్‌లో ఒక పూతలపట్టు మండలం మాత్రం రాగా ఆ నియోజకవర్గంలోని మిగిలిన మండలాలు అర్బన్ డివిజన్‌కు వచ్చాయి. ఆ ఒక మండలాన్ని అర్బన్ పరిధిలో తేవడానికి నివేదిక పెట్టినట్లు తెలుస్తోంది. ఎక్కడో 60 కిలోమీటర్లు అవతల ఉన్న నగరి సబ్‌డివిజన్‌లోని పానూరు, నగరి టౌన్, నగరి రూరల్, నింద్రను చిత్తూరు రూరల్ డివిజన్‌కు మార్చారు. 12 సెక్షన్లతో చిత్తూరు రూరల్ డివిజన్‌కు కేటాయించారు. కానీ చిత్తూరు రూరల్ కార్యాలయంలో టేబుళ్లు, ఫర్నిచర్ లేదు. దీంతో ఎస్ఈ కార్యాలయంలో ఉద్యోగులు సర్దుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.